క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

తాడూరు: ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించి, కనీస వేతనం రూ.600 ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అల్లాపూర్, గోవిందాయిపల్లిలో కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఏట బడ్జెట్ తగ్గిస్తూ కూలీల పొట్ట కొడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. గ్రామాలలో పనిచేసే ప్రదేశాల దగ్గర మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, మహేష్, నారాయణ, శివుడు, వెంకటస్వామి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

పెద్దకొత్తపల్లి: గంట్రావ్‌పల్లి ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యుడు హరితమోహన్ కూతురు సౌమోయశ్రీ జన్మదిన సందర్భంగా 8, 9వ తరగతి విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అధ్యక్షుడు రాఘవేందర్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పవన్, శివుడు, హుస్సేన్, కురుమయ్య, గౌస్‌పాషా పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా బాధ్యతలు


వెంకట్‌రెడ్డి

తాడూరు: మండల సింగిల్‌విండో అధ్యక్షుడిగా సమ్మద్‌పాషా రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న వెంకట్‌రెడ్డి గురువారం డీసీఓ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

బాధ్యతతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

తాడూరు: ప్రభుత్వ ఉద్యోగి తన విధులను బాధ్యతతో నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవన ఆవరణలో తుమ్మలసూర్ పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున్ ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా ఆయనను హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



వెల్దండ: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవి తెలిపారు. గురువారం మండలంలోని కొట్రగేట్ వద్ద హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ డబ్బులు తరలించి పట్టుబడితే పూర్తిస్థాయిలో వివరాలు చూపితే వదిలేస్తారన్నారు.

విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న ఫారెస్ట్ ఏకో పార్కులో అధికారులు గేమ్యానాయక్ తండా పాఠశాల విద్యార్థులకు నేచర్ స్టడీ క్యాంపు– ఫారెస్టు అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా అవగహన కల్పించారు. ఫారెస్టు అధికారులు మాట్లాడుతు గ్లోబల్ వార్మింగ్ భూతాన్ని అరికట్టాలంటే చెట్లు పెంచాల్సిన అవసరాన్ని, ప్రకృతిలో మొక్కలు, జీవరాశుల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు శ్యామ్ సుందర్, హెచ్‌ఎం రమణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



తెలకపల్లి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గట్టునెల్లికుదురు చెందిన పులిజారత్ శివకుమార్ ట్రాక్టర్‌లో దుందుబీ వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా గొరెడ్డిపల్లి సమీపంలో పట్టుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్, శివకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిహారం ఇవ్వాలి

వీపనగండ్ల: మండలంలో వేలాది ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేసిన రైతులు 90 శాతం దిగుబడిని కోల్పోవడంతో రూ.లక్షల్లో నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, వారికి వెంటనే పరిహారం అందివ్వాలని సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, మహబూబ్‌పాషా, ఆశన్న, నర్సింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గోవర్ధనగిరి, సంగినేనిపల్లి, కల్వరాల, వీపనగండ్ల గ్రామాల్లో ఎకరా మామిడి తోట కోసం రూ.50 వేల వరకు ఖర్చు చేశారన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.


కల్వకుర్తిలో ఓటేసేందుకు వెళ్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరులు



అచ్చంపేటలో బస్సులు దిగి వస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్సీ ఉపఎన్నిక ప్రశాంతం


అచ్చంపేటలో ఓటు వేసేందుకు సహాయకులతో వస్తున్న లింగాల జెడ్పీటీసీ నేనమ్మ


హైదరాబాద్ నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి వాహనాల్లో వస్తున్న అచ్చంపేట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు

కల్వకుర్తి: ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి గురువారం పోలింగ్ నిర్వహించారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు 72 ఓట్లు ఉండగా మధ్యాహ్నం 3 గంటల వరకు వంద శాతం ఓట్లు పోల్ అయ్యాయి. ఆర్డీఓ శ్రీను ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మొదట కల్వకుర్తి జెడ్పీటీసీ భరత్‌ప్రసాద్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ చెందిన సభ్యులు ఓటు వేశారు. పోలీసులు ఓటర్ గుర్తింపు కార్డు జారీ అయిన వారిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ కల్వకుర్తిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

క్యాంపు నుంచి ఓటింగ్‌కు

శాసన మండలి సభ్యుడి ఎన్నికకోసం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు వేర్వేరుగా క్యాంపులను ఏర్పాటు చేసుకున్నాయి. బీఆర్‌ఎస్ చెందిన సభ్యులు గోవా నుంచి నేరుగా గురువారం పోలింగ్ కేంద్రం వద్దకు రాగా, కాంగ్రెస్ పార్టి సభ్యులు హైదరాబాద్ నుంచి బస్సులో కల్వకుర్తి పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.


కొల్లాపూర్‌లో ప్రజాప్రతినిధుల ఓటరు ఐడీ కార్డులు పరిశీలిస్తున్న సీఐ మహేష్

ఓటేసిన 67 మంది ప్రజాప్రతినిధులు

కొల్లాపూర్: నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో కేంద్రం ఏర్పాటుచేశారు. మొత్తం 67 ఓట్లకు గాను అన్ని ఓట్లు పోలయ్యాయి. ఉదయం 10 గంటల వరకు ఒక్క ఓటు మాత్రమే పోలయ్యింది. 10 నుంచి 12 గంటల మధ్యలో 19 ఓట్లు, 12 నుంచి 2 గంటల మధ్యలో 44 ఓట్లు, 2 నుంచి 4 గంటల మధ్యలో 3 ఓట్లు పోలయ్యాయి. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లోనే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు క్యాంపుల నుంచి నేరుగా బస్సుల్లో కేంద్రం వద్దకు వచ్చారు. ఆర్డీఓ నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. సీఐ మహేష్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటుచేశారు.

అచ్చంపేటలో వందశాతం పోలింగ్..

అచ్చంపేట: మహబుబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఉదయం 8గంటలకు ప్రారంభం కాగా 9:50 గంటలకు అచ్చంపేట జెడ్పీటీసీ మంత్యానాయక్, వైస్ ఎంపీపీ చీమర్ల అమరావతి మొదటి ఓటు వేశారు. 11గంటలకు మరో ఇద్దరు ఓటు వేశారు. ఉదయం మందకొండిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం 11:30 గంటలకు బీఆర్‌ఎస్‌కు చెందిన 23 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హైదరాబాద్ నుంచి వాహనాల్లో వచ్చి ఓటు వేశారు. ఒంటిగంటకు కాంగ్రెస్‌కు చెందిన 50 మంది రెండు బస్సుల్లో వచ్చి ఓటు వేయడంతో సుమారుగా 97.47 శాతం పోలింగ్ అయ్యింది. చివరగా 3:45గంటలకు ఒక ఓటుతో వందశాతం పోల్ అయ్యింది. బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అచ్చంపేటలో 79 ఓట్లకు గాను 79 ఓట్లు పోల్ కాగా 37 మంది పురుషులు, 42 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేంద్రం నుంచి బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్‌లను మహబుబ్‌నగర్‌కు తరలించారు. ఏప్రిల్ 2వ తేదీన కౌటింగ్, ఫలితాలు వెల్లడించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి మాధవి పోలింగ్ సరళిని పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్‌ఐలు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోర్డులకే పరిమితం



మర్రిపల్లిలో చెరువు శిఖం భూమిలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణం

- పాఠశాలల్లో ఉన్న కొద్దిపాటి ఆటస్థలాల్లోనే క్రీడా ప్రాంగణాలు
- మూలనపడ్డ ఆట వస్తువులు

ఉప్పునుంతల: గ్రామీణ యువతకు క్రీడలపై ఆసక్తి పెంచడానికి ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల పరిస్థితి మండలంలో బోర్డులకే పరిమితమైంది. గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం, ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో మండల స్థాయి అధికారులు చేసేది లేక స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కొద్ది పాటి ఆట స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా బోర్డులు తగిలించేశారు. మరికొన్ని గ్రామాల్లో చెరువు శిఖం భూముల్లో, ఆటలు ఆడుకోవడానికి అనువుగా లేని స్థలాల్లో నామమాత్రంగా క్రీడా ప్రాంగణాలుగా చూపించి బోర్డులు పెట్టారు. మండలంలోని 27 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలకు స్థలాలు ఎంపిక చేసి బోర్డులు మాత్రం పెట్టారు. మండలంలోని మర్రిపల్లిలో సమీపంలోని చెరువు శిఖం భూమిలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేయడంతో చెరువు నిండితే నీట మునిగిపోయే పరిస్థితి ఉంది. సీబీ తండాలో క్రీడా ప్రాంగణం కోసం ఎంపిక చేసిన స్థలం బండరాళ్లతో నిండింది. లక్ష్మాపూర్, సూర్య తండాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న కొద్ది పాటి స్థలంలోనే క్రీడా ప్రాంగణాలుగా ఎంపిక చేశారు. ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్, పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్న ఆటస్థలాలనే క్రీడా ప్రాంగణాలుగా చూపిస్తున్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడానికి రూ. 1.29 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు ఆయా పంచాయతీల్లో కేవలం రూ.7 లక్షలు మాత్రమే ఖర్చుచేసి ఎంపిక చేసిన స్థలాల్లో కొంతమేర మొరం చల్లించారు. కొరటికల్, మర్రిపల్లి, అయ్యవారిపల్లి, లత్తీపూర్ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఏమాత్రం క్రీడా ప్రాంగణాల అభివృద్ధి పనులు మొదలుపెట్టలేదు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటుతోపాటు యువకులు ఆడుకోవడానికి ప్రభుత్వం నుంచి క్రికెట్ కిట్లు, వాలీబాల్, డంబెల్స్ తదితర అన్ని రకాల ఆట వస్తువులు ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఉన్నాయి.


మొల్గర ప్రాథమిక పాఠశాలలో ప్రహరిగోడకు తగిలించిన క్రీడా ప్రాంగణం బోర్డు

స్థలాలు అందుబాటులో లేకనే..



గ్రామాల్లో క్రీడాప్రాంగణాల కోసం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకనే ఇబ్బందిగా ఉంది. దాంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశాం. కొన్ని గ్రామాల్లో తప్పనిసరి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న స్థలాలను ఎంపికచేసి మట్టి, మొరం పోయించి ఆట స్థలాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాం. ఆటలకు సంబంధించిన అన్ని కిట్లు పంచాయతీల్లో యువతకు అందుబాటులో ఉంచాం.

– లక్ష్మణ్‌రావు, ఎంపీడీఓ, ఉప్పునుంతల

మాజీ సర్పంచ్ భర్తపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: కుమ్మెర మాజీ సర్పంచ్ భర్త తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ గురువారం తెలిపారు. తిరుపతిరెడ్డి గ్రామ సమీపంలో పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిర్వహిస్తున్న ఓ కంపెనీ నుంచి రూ.20లక్షలను కోటమైసమ్మ, బొడ్రాయి, పోతురాజు పండుగలకు నిర్వహించేందుకు తీసుకుని, తన సొంత ఖర్చులకు వాడుకున్నారని తెలిపారు. దీంతో గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌పీని కలిసిన నాయకులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఓయూ నాయకుడు మారేడు ఈశ్వర్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానికేతరులకే అవకాశాలు కల్పిస్తున్న పార్టీలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వ్యక్తికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు టికెట్ కేటాయించినందుకు ఆయనను గెలిపించాలని ఆయన కోరారు.

ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలి


ఫంక్షన్‌హాల్‌కు తాళం వేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని పలు కమర్షియల్ భవనాలు వాటి ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని పలు భవనాలను పరిశీలించి, అసెస్‌మెంట్ ఇంకా చేయించుకోని మున్సిపల్ సిబ్బందితో కలిసి సీజ్ చేశారు. పట్టణంలోని కుర్మిద్ద రోడ్డులో ఉన్న రాయల్ ఫంక్షన్‌హాలు ప్రారంభమైన నాటి నుంచి అసెస్‌మెంట్ చేయించలేదని, వెంటనే అసెస్‌మెంట్ చేయించుకొని పూర్తి ఆస్తిపన్ను చెల్లించాలని హెచ్చరించారు. అదేవిధంగా పట్టణంలో ఇంకా చాలా భవనాలు ఇలానే కొనసాగుతున్నాయని, వాటన్నింటిని పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఆస్తిపన్నులో పాతబకాయిల వడ్డీపై 90 శాతం రాయితీ పథకం ఉందని, పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట మేనేజర్ రాజకుమారి, ఆర్‌ఐ చంద్రయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే దళితుల ఎజెండా


నియామకపత్రాలు అందిస్తున్న చింతసత్తి

కల్వకుర్తిరూరల్: మాలమహానాడు సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి చింతసత్తి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా సలహాదారుడిగా జగపతి, డివిజన్ అధ్యక్షుడిగా రాజు, మహిళా జిల్లా ప్రచార కార్యదర్శిగా మణెమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఝాన్సీ, గంగావతి, అంజయ్యలకు నియామక పత్రాలు అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో విఫలం అవుతున్నాయని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పడం సరికాదన్నారు. బీజేపీని ఓడించడమే దళితుల ఏకైన ఎజెండా అని అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, అజయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు


కర్నె శ్రీహరి


రాజేందర్

కొల్లాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించగా, మిగతా పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నె శ్రీహరి విజయం సాధించారు. ఉపాధ్యురాలిగా ఎస్.రామలక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా పిరంగి గోవిందు, కోశాధికారిగా నిరంజన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది కాలంపాటు ఈ కమిటీ కొనసాగుతుంది. అసోసియేషన్ గౌరవ, మర్యాదలు పెంచేందుకు కృషిచేస్తానని అధ్యక్షుడు వెల్లడించారు.

అచ్చంపేట రూరల్: బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగాపురం రాజేందర్ ఎన్నికయ్యారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కౌసర్, కల్చరల్ సెక్రటరీగా మల్లయ్యను ఎన్నుకున్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని శ్రీనిధి మేనేజర్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లిలో స్వయం సహాయక సంఘాలకు శ్రీనిధి రుణాలు సూక్ష్మ, ఆర్థిక ప్రణాళిక ద్వారా ప్రతి సంఘంలో రుణాలు మంజూరు చేశారు. ట్యాబ్ సాయంతో స్వయంసహాయ సంఘాలకు వివిధ జీవనోపాదుల కోసం రుణాలను మంజూరు చేశామన్నారు. మహిళా సంఘాలలోని సభ్యులకు రూ.22 లక్షలు రుణాలను అందజేశామన్నారు. మండలంలో శ్రీనిధి కింద రూ.5.15కోట్లు 2023–24కు సంబంధించి లక్ష్యం ఉందన్నారు. ఇప్పటివరకు రూ.4.70 కోట్లు సంఘాలకు రుణాలు అందజేశామన్నారు. ఈ నెల 31 వరకు వంద శాతం రుణాలు పూర్తి చేస్తామని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, సీసీ సుజాత, ఉమాదేవి, ఎల్లమ్మ, లక్ష్మి, కోశాధికారి యశోదమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల చెందిన బలిజ సునీత, రమేష్ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. మృతుల కుటుంబాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.6 వేల చొప్పున కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో కిశోర్, లింగం, తిరుపతయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

తాగునీటికి కటకట


బస్వాపురం గ్రామంలో తాగునీటి ట్యాంకు వద్ద ప్రజలు

చిన్నంబావి మండల జనాభా 29,196		
కుటుంబాలు 6,788	బోరుబావులు 78	పని చేసేవి 47
భూగర్భ జలాలు అడుగంటినవి 31	ప్రతిరోజు కావాల్సిన నీరు 28.220 లక్షల లీటర్లు	
అందుతున్న నీరు 24.400 లక్షల లీటర్లు	కొరత 4 లక్షల లీటర్లు	
చెరువులు 9	వాటర్ ట్యాంకులు 36	చేతి పంపులు 59
పనిచేయనివి 33		

- సక్రమంగా సరఫరా కానీ 'భగీరథ' నీరు
- బోరు బావుల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- ముందస్తు చర్యలకు నిధుల మంజూరు



చిన్నంబావి: రోజురోజుకూ ఎండలు తీవ్రత పెరుగుతుండడంతో బావి, బోరు బావి, చేతిపంపుల్లోని భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవి ప్రారంభంలోనే మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగు నీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామాల్లో అరకొర ఉన్న చేతిపంపులు, బోరుబావుల వద్ద బారులు తీరాల్సిన పరిస్థతి నెలకొంది. రూ.కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినా వాటి ద్వారా ఎన్ని రోజులకు నీటి సరఫరా అవుతాయో తెలియని పరిస్థితి. గ్రామంలో ఉన్న బావులు ఎండిపోవడం, బోరుబావులు సైతం వట్టిపోవడంతో కొంత మేర చేతిపంపులతో తాగనీటి దప్పికను తీర్చుకుంటున్నారు.

మండలంలో పరిస్థితి

మండలంలోని 17గ్రామపంచాయతీలుండగా 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని పంచాయతీ అధికారులు తెలిపారు. వెల్టూరు, కొప్పునూరు, అయ్యవారిపల్లి, చిన్నమారు, బస్వాపురం, గూడెం గ్రామాల్లో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొంది. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు కనిష్ట మట్టానికి పడిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వెలగొండ, మియాపూర్, పెద్దమారు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి ప్రత్యేక దృష్టితో రూ.50.96లక్షల నిధులను మంజూరు చేయడంతో అధికారులు తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.


గూడెం గ్రామంలో తాగునీటి కోసం క్యూలైన్‌లో నిలుచున్న జనాలు (ఫైల్)

తిప్పలు పడుతున్నాం



కొన్ని రోజుల నుంచి తాగు నీటి కోసం చాలా తిప్పలు పడుతున్నాం. ఉదయం లేచినప్పటి నుంచి తాగు నీటి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. గ్రామంలో ఉన్న బోర్లలో నీరు రాకపోవడంతో ఉన్న ఒక్క బోరుబావి ద్వారా ఊరందరికీ నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా ఉంది. – బొజ్జన్న, చిన్నంబావి

తాగునీరు సరఫరా లేదు



పేరుకే మిషన్ భగీరథ ట్యాంకులు, పైప్‌లైన్లు ఊరికి దిష్టిబొమ్మల దర్శన మిస్తున్నాయి. ఒకవైపు బోరుబావులు, చేతిపంపులు ఎండిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. రోజు కూలీ పనులు చేసుకునే మేము తాగునీటి కోసం మూడు నాలుగు గంటలు కష్టపడాల్సి వస్తోంది. – బీసన్న, బస్వాపురం

ముందస్తు చర్యలు చేపడుతున్నాం



మండలంలో 17 పంచాయతీల్లో 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉందని గుర్తించాం. దీంతో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యల కోసం రూ.50.96లక్షల నిధులతో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తాగనీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్య ఎక్కువ ఉంటే నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రయత్నిస్తాం. – రమణరావు, ఎంపీడీఓ, చిన్నంబావి